క్లుప్తంగా

ఓటు వేయడం ప్రాథమిక హక్కు



ఈవీఎం పనితీరుపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

హాలహర్వి: ప్రతి ఒక్కరూ ఓటు వేయడం ప్రాథమిక హక్కుగా పరిగణించాలని తహసీల్దార్ మల్లికార్జునస్వామి, ఎంపీడీఓ ఆంతోని సూచించారు. ఈ మేరకు శుక్రవారం మండలంలోని గూళ్యం గ్రామంలో ఈవీఎంల పనితీరుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. ఒక్క ఓటు ద్వారా రాజకీయ నాయకుల భవిష్యత్‌ను నిర్ణయించే అవకాశం ఉంటుందన్నారు. ప్రాథమిక హక్కుల్లో భాగంగా ఓటుహక్కు చాలా ప్రభావితమైందన్నారు. జూనియర్ అసిస్టెంట్ మల్లేష్, తలారులు, గ్రామప్రజలు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



ఎల్లార్తిలో రైతుకు మంజూరైన మోటార్, పైపులు, పంపుసెట్

హొళగుంద: రైతు సంక్షేమమే వైఎస్సార్‌సీపీ ధ్యేయమని ఎల్లార్తి గ్రామ సర్పంచ్ కురువ చాముండేశ్వరి, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎస్కే గిరి అన్నారు. శుక్రవారం ఎల్లార్తిలో గ్రామానికి చెందిన రైతు లింగాయత్ చంద్రశేఖర్‌గౌడ్‌కు వైఎస్సార్ జలకళ కింద మంజూరైన మోటారు, పైపులు, పంపుసెట్టును లబ్ధిదారుడికి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరుపేద రైతుల పొలాల్లో ప్రభుత్వం బోర్లు వేసి సాగునీరు అందేలా చర్యలు తీసుకుంటుందని చెప్పారు. గ్రామస్తులు శరబన్న, బనిశంకర్ తదితరులు ఉన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న చైర్మన్ రుద్రగౌడ్ తదితరులు

ఎమ్మిగనూరుటౌన్: వీరశైవ లింగాయత్ సంక్షేమ సంఘ నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆ కార్పొరేషన్ చైర్మన్ రుద్రగౌడ్ శుక్రవారం తన నివాసంలో సంఘ పెద్దలతో కలిసి ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో వీరశైవులు లబ్ధిపొందారన్నారు. వీరశైవ లింగాయత్ సంక్షేమ సంఘ పెద్దలు పాల్గొన్నారు.

అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు



ప్రజలతో మాట్లాడుతున్న పత్తికొండ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి

దేవనకొండ: గ్రామాల్లో అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని పత్తికొండ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి హెచ్చరించారు. ఆయన శుక్రవారం మండలంలోని కప్పట్రాళ్ల గ్రామంలో ప్రజలతో సమావేశమయ్యారు. డీఎస్పీ మాట్లాడుతూ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో గ్రామాల్లో వర్గవిబేధాలు, అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. ప్రజలందరూ అన్నదమ్ముల్లా కలిసిమెలిసి జీవించాలన్నారు.

మలేరియాపై అప్రమత్తంగా ఉండాలి

మద్దికెర: మలేరియా, డెంగ్యూ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ వైద్యాధికారులు శ్రీలక్ష్మి, రాగిణి సూచించారు. శుక్రవారం డ్రైడే సందర్భంగా మద్దికెరలోని పలు కాలనీలలో పర్యటించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇళ్లలో ఎక్కువ రోజులు నీరు నిల్వ ఉంచరాదన్నారు. అలాగే పూల కుండీలు, టైర్లు తదితర వాటిలో నీరు నిల్వ ఉండడం వల్ల దోమలు వ్యాప్తి చెంది రోగాలకు కారణమవుతాయన్నారు. రోడ్లపై మురుగు నీటిని వదలడం వల్ల దోమలు వ్యాప్తి చెందే ప్రమాదముందన్నారు. రోజుల తరబడి జ్వరం ఉంటే ప్రభుత్వ వైద్యశాలలో రక్తపరీక్షలు చేయించుకోవాలని సూచించారు. సీహెచ్‌ఓ నిరంజన్ బాబు, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు వెంట ఉన్నారు.

గంగమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు

మద్దికెర: స్థానిక మద్దమ్మ చెరువు గట్టు వద్ద ఉన్న, రజకులు ఇష్ట దైవంగా కొలిచే గంగమ్మ దేవాలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా అమ్మవారిని ప్రత్యేకంగా పూలతో అలంకరించి అభిషేకం, మహామంగళహారతి, అనంతరం ఆకుపూజ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. పూజా కార్యక్రమాలకు విచ్చేసిన భక్తాదులకు అన్నదానం చేశారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని అమ్మవారికి పూజలు చేశారు.

అవ్వాతాతలకు అండగా ప్రభుత్వం

- రూ.3 వేలకు పింఛన్ పెంపుతో హామీ నెరవేర్చాం
- ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి
- ఇబ్రహీంపురంలో వైఎస్సార్ పెన్షన్ కానుక పంపిణీ





ఇబ్రహీంపురంలో బోయ సోమక్కకు కొత్త పింఛన్ అందజేస్తున్న ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి, సభకు హాజరైన లబ్ధిదారులు

నందవరం: ఇచ్చిన మాట ప్రకారం పింఛన్ సొమ్ము రూ.3 వేలకు పెంచిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని ఇబ్రహీంపురం గ్రామంలో పింఛన్ల పెంపు వారోత్సవాల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యేకు పార్టీ నాయకులు, అధికారులు ఘన స్వాగతం పలికారు. మండలంలో 86 కొత్త పింఛన్లు మంజూరు కాగా లబ్ధిదారులకు ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మాచాని వెంకటేష్, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీకాంతరెడ్డి, సర్పంచ్ నాగేశ్వర రెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అవ్వాతాతల మోములో ఆనందం నింపేలా ప్రభుత్వ కృషి చేస్తోందన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రూ.3 వేలు పింఛన్ అందిస్తున్న ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. పేదల సంక్షేమ కోసం అనేక పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారని వివరించారు. అలాగే గ్రామంలోని జెడ్పీ పాఠశాలలో అదనపు గదుల నిర్మాణానికి రూ.1.20 కోట్లు, మరమ్మతులకు రూ.60 లక్షలు కేటాయించి అభివృద్ధి చేశామన్నారు. 'గడప గడపకు మన ప్రభుత్వం' నిధులు రూ.40 లక్షలతో సీసీ రోడ్లు, డ్రైయినేజీ పనులు జరుగుతున్నాయని వివరించారు. ఇబ్రహీంపురం, కొట్టాల, మాచాపురం గ్రామాలకు రూ.కోటితో తుంగభద్ర నది నుంచి పైపులైన్ నిర్మాణం చేపట్టి గ్రామాల్లోని ఓవర్‌హెడ్ ట్యాంకులకు పంపిణీ చేస్తామని హామీ ఇచ్చారు.

ఆస్పరి: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ సారథిగా నిలిచాడని వైఎస్సార్‌సీపీ నాయకుడు గుమ్మనూరు నారాయణస్వామి పేర్కొన్నారు. శుక్రవారం ఆస్పరి మండల పరిషత్ కార్యాలయంలో కొత్తగా పింఛన్లు మంజూరైన 117 మంది లబ్ధిదారులకు నగదు అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. గత టీడీపీ, ప్రస్తుత వైఎస్సార్‌సీపీ పాలనలో పింఛన్ల పంపిణీ ఎలా జరుగుతుందో గుర్తుచేశారు. ఎంపీడీఓ రాణెమ్మ, సర్పంచ్ మూలింటి రాధమ్మ, వైఎస్సార్ సీపీ నాయకులు మూలింటి రాఘవేంద్ర, కట్టెల గోవర్ధన, పెద్దయ్య, సుంకర రామాంజినేయులు తదితరులు పాల్గొన్నారు. అలాగే ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన చిన్నహోతూరుకు చెందిన జేసీయస్ మండల కన్వీనర్ బసవరాజును ఆయన ఇంటికి వెళ్లి నారాయణస్వామి పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

చిప్పగిరి: స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఆలూరు మార్కెట్ యార్డు చైర్మన్ గుమ్మనూరు నారాయణ, కన్వీనర్ మారయ్య లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. మండలానికి 51 కొత్త పింఛన్లు మంజూరైనట్లు వారు తెలిపారు. సర్పంచ్ గోవిందరాజులు, ఎంపీడీఓ కొండయ్య, ఈఓపీఆర్డీ బాలన్న, పంచాయతీ కార్యదర్శి నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

కర్నూలు వెళ్లి పింఛన్ అందజేత

తుగ్గలి: మండల పరిధిలోని బొందిమడుగులకు చెందిన బోయ విజయలక్ష్మి అనారోగ్యంతో కొద్ది రోజులుగా కర్నూలులోనే ఉంటూ చికిత్స తీసుకుంటోంది. ఊరికి వచ్చేందుకు వీలుకాదని తెలుసుకున్న వలంటీర్ బీటీ సురేష్ శుక్రవారం కర్నూలుకు వెళ్లి ఆమెకు వితంతు పింఛన్ సొమ్ము రూ.3వేలు అందజేశారు. దీంతో ఆమె సంతోషం వ్యక్తం చేశారు.

హొళగుంద: వైఎస్సార్‌సీపీ పాలనలో అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి పింఛన్ అందుతుందని సర్పంచ్ కృష్ణవేణి, పంచాయతీ సెక్రటరీ రాజశేఖర్ అన్నారు. శుక్రవారం హెబ్బటం గ్రామ సచివాలయంలో కొత్తగా మంజూరైన పింఛన్లను గ్రామపెద్దలు నరసప్ప తదితరులతో కలిసి లబ్ధిదారులకు అందజేశారు. గ్రామానికి కొత్తగా మంజూరైన వాటితో కలుపుకుని మొత్తం 450 మందికి పింఛన్లు అందిస్తున్నట్లు వారు తెలిపారు.

సంక్షేమ సారథికి పట్టం కడదాం : మాచాని వెంకటేష్

పేదల సంక్షేమానికి పాటు పడుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని 2024 ఎన్నికల్లో మళ్లీ గెలిపించుకుని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మాచాని వెంకటేష్ పిలుపునిచ్చారు. ఆయన మాట్లాడుతూ.. పేదల సంక్షేమ కోసం నిరంతరం శ్రమిస్తున్న సీఎం జగనన్నకు అండగా నిలువాలని కోరారు. ముగతి సర్పంచ్ విరుపాక్షిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పేట శ్రీనివాసరెడ్డి, చాంద్‌బాషా, బీషమ్మ, తహసీల్దార్ నిత్యానందరాజు, ఎంపీడీఓ దశరథ రామయ్య, వైకేపీ ఏపీఎం చిన్నవీరన్న, ఎస్‌ఐ తిమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.



ఆస్పరిలో కొత్తగా మంజూరైన పింఛన్లను పంపిణీ చేస్తున్న గుమ్మనూరు నారాయణ స్వామి



కర్నూలు వెళ్లి విజయలక్ష్మికి పింఛను అందజేస్తున్న వలంటీర్ బీటీ సురేష్

సంతోషంగా ఉంది



కొత్తగా పింఛన్ మంజూరైనందుకు సంతోషంగా ఉంది. వృద్ధాప్యంలో ఉన్న నాకు పింఛన్ డబ్బులు ఎంతో ఉపయోగపడుతాయి. మాలాంటి వారికి దేవుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. – హైమావతి, చిరుమాన్‌దొడ్డి, ఆస్పరి మండలం

జగనన్నకు రుణపడి ఉంటా



నా భర్త అనారోగ్యంతో మరణించాడు. ఆసరా కోల్పోయిన నాకు ఎవ్వరి సిఫార్సు లేకుండానే వితంతు పింఛన్ మంజూరైంది. రూ.3 వేలు పింఛన్ అందుకున్నాను. ఇంటి వద్దకే పింఛన్ సొమ్ము అందించేలా చర్యలు తీసుకుంటున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటా. – నాగమ్మ, ఆస్పరి

నెల రోజుల్లోపే పింఛన్ మంజూరైంది



దరఖాస్తు చేసుకున్న నెల రోజులకే కొత్త పింఛన్ మంజూరైనందుకు సంతోషంగా ఉంది. పింఛన్ డబ్బులు ఎంతో ఉపయోగపడుతాయి. జగనన్న సహాయం ఎప్పటికి మరువను. – సుంకమ్మ జొహరాపురం, ఆస్పరి మండలం



చిప్పగిరిలో పింఛన్ పంపిణీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఉత్సాహంగా క్రీడాపోటీలు

ఎమ్మిగనూరురూరల్: మండలంలోని ఆయా సచివాలయాల పరిధిలో 'ఆడుదాం–ఆంధ్ర' క్రీడాపోటీలు రసవత్తరంగా జరుగుతున్నాయి. శుక్రవారం మండల పరిధిలోని గుడేకల్, కోటేకల్ గ్రామాల్లోని జెడ్పీ స్కూళ్ల మైదానాల్లో ఎంపీడీఓ బంగారమ్మ, ఈఓఆర్డీ విజయలక్ష్మి, కె.తిమ్మాపురంలో సీడీపీఓ సఫర్నిసాబేగం, నాయకులు బజారి కబడ్డీ పోటీలను ప్రారంభించారు. ఎంపీడీఓ బంగారమ్మ, ఉపాధ్యాయురాళ్లు కబడ్డీ ఆడి ఉత్సాహం నింపారు. సచివాలయాల ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

తుగ్గలి: క్రీడలు శారీరక, మానసిక ఉల్లాసానికి దోహదం చేస్తాయని, అలాగే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తాయని ఎంపీడీఓ సావిత్రి, వైఎస్సార్‌సీపీ సేవాదల్ జిల్లా కార్యదర్శి మోహన్‌రెడ్డి అన్నారు. 'ఆడుదాం ఆంధ్ర' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం సచివాలయాల పరిధిలో కబడ్డీ పోటీలు నిర్వహించారు. తుగ్గలిలో వారు కబడ్డీ పోటీలను ప్రారంభించారు. క్రీడలకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని క్రీడాకారులు రాణించాలని ఆకాంక్షించారు. హెచ్‌ఎం విజయలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి రాజు నాయక్, ఫిజికల్ డైరెక్టర్ చందూనాయక్ తదితరులు పాల్గొన్నారు.



కోటేకల్‌లో కబడ్డీ కూతకు వెళ్లిన ఉపాధ్యాయురాలు

విద్యార్థినులకు ముగ్గుల పోటీలు

హొళగుంద: మహిళలకు ఇష్టమైన ముగ్గుల పోటీలకు ప్రతి ఒక్కరు ప్రాధాన్యత ఇవ్వాలని వైఎస్సార్‌సీపీ నాయకులు మేలగిరి, పీసీ చైర్మన్ భీమలింగప్ప అన్నారు. శుక్రవారం వందవాగిలి కన్నడ ప్రాథమికోన్నత పాఠశాలలో హెచ్‌ఎం శేషాద్రి ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగ సమీపిస్తున్న సందర్భంగా విద్యార్థినులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు నాయకులు, గ్రామపెద్దల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. గ్రామపెద్దలు జయన్న, టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

అయోధ్య అక్షింతల పంపిణీకి సిద్ధం

కృష్ణగిరి: అయోధ్యలో శ్రీరామ విగ్రహ ప్రతిష్ఠ రోజున ప్రతి ఇంట్లో శ్రీరామ స్పర్శ అక్షింతలతో పూజ కార్యక్రమాలు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు శ్రీరామ భక్తులు, గ్రామ పెద్దలు కృష్ణమూర్తి, ర ఘురామిరెడ్డి, బలరాముడు తెలిపారు. మండల పరిధిలోని పెనుమాడ గ్రామంలోని శ్రీరామ దేవాలయంలో శుక్రవారం రాత్రి వారు అక్షింతలను ప్యాకింగ్ చేశారు. వీటిని ప్రతి ఇంటికి పంపిణీ చేస్తామన్నారు. ఈ నెల 22న ప్రతి ఒక్కరు తమ ఇంట్లో శ్రీరామ ప్రతిమపై అక్షింతలు వేసి పూజా కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు.

గ్రామాభివృద్ధిపై దృష్టి పెట్టాలి



హెబ్బటం గ్రామసభలో మాట్లాడుతున్న రాజశేఖర్

హొళగుంద: గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి కృషి చేయాలని హెబ్బటం గ్రామస్తులు కోరారు. శుక్రవారం హెబ్బటం గ్రామంలో పంచాయతీ సెక్రటరీ రాజశేఖర్ సర్పంచ్ కృష్ణవేణి ఆధ్వర్యంలో వార్డు మెంబర్లతో కలిసి గ్రామసభ నిర్వహించారు. రాజశేఖర్ మాట్లాడుతూ.. తాగునీరు, డ్రైనేజీలు, సీసీ రోడ్ల వ్యవస్థ ఇతర అన్నింటిపై దృష్టి పెట్టి ప్రజలు ఇబ్బందులు పడకుండా తగిన చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే పంచాయతీకి ఆదాయ వనరుల పెంపుపై దృష్టి సారించి తద్వారా సమకూరే నిధులను అభివృద్ధి పనులకు వాడుకుంటామన్నారు. వైస్ సర్పంచ్ సవారప్ప, వార్డు సభ్యులు, గ్రామపెద్దలు నరసప్ప, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు

కృష్ణగిరి: గత నెల 15న ఆలంకొండ గ్రామంలో మాదిగ రామస్వామిని కులం పేరుతో దూషించి, దాడికి దిగాడన్న ఫిర్యాదు మేరకు అదే గ్రామానికి చెందిన బోయ మేకల సుంకన్నపై శుక్రవారం ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాసులు తెలిపారు. గ్రామంలోని బస్టాండులో ఓ హోటల్ వద్ద టీ తాగుతున్న రామస్వామిని నిందితుడు దూషించడంతోపాటు కాళ్లు, చేతులపై కర్రతో దాడి చేసి, చెవిని కొరికాడన్నారు. గ్రామస్తులు విడిపించడంతో ఆసుపత్రి వెళ్లి చికిత్స పొందిన అనంతరం పెద్ద మనుషుల పంచాయితీలో సైతం న్యాయం జరగకపోవడంతో పోలీసులనాశ్రయించినట్లు బాధితుడు ఫిర్యాదు చేశాడన్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు హెచ్‌సీ తెలిపారు.

రోడ్డు నిబంధనలు పాటించాలి

గోనెగండ్ల: వాహనదారులు తప్పనిసరిగా రోడ్డు భద్రత నియమాలు పాటించాలని ఎస్‌ఐ తిమ్మారెడ్డి సూచించారు. శుక్రవారం సాయంత్రం ఆయన గాజులదిన్నె ప్రాజెక్ట్ స్టేజీ వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. డ్రైవింగ్ లైసెన్స్, వాహన ధ్రువీకరణ పత్రాలు లేని వారికి జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులు రోడ్డు నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, అతివేగంగా వాహనం నడపరాదన్నారు. పెండింగ్ చలానాలు ఉన్నవారు వెంటనే చెల్లించాలని సూచించారు. పోలీసు సిబ్బంది వెంట ఉన్నారు.

కొనసాగుతున్న క్రీడాపోటీలు

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో జరగనున్న నీలకంఠేశ్వర స్వామి జాతర మహోత్సవం సందర్భంగా స్థానిక వైడబ్ల్యూసీఎస్ మైదానంలో నిర్వహిస్తున్న వైఎస్సార్ అంతర్‌రాష్ట్ర క్రికెట్ టోర్నీలో 15వ రోజైన శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో రాయచూరు టైటానిక్ జట్టు గెలుపొందింది. ఆర్‌కే జట్టుపై రాయచూరు గెలుపొందగా ఆ జట్టులో ప్రతిభ చాటిన రహీంకు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ షీల్డ్‌ను స్థానిక వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ కామర్తి నాగేషప్ప అందజేశారు. అలాగే రెండవ మ్యాచ్‌లో వీఎస్ వీఎస్‌డీ జట్టుపై యంగ్ సహరా జట్టు గెలుపొందింది. ఆ జట్టులో ప్రతిభ చాటిన ఉస్మాన్‌కు రెండో వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ చంద్రశేఖర్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌ను అందజేశారు. ఆర్గనైజర్ నజీర్‌అహమ్మద్, టౌన్‌బ్యాంక్ డైరెక్టర్లు సయ్యద్‌చాంద్, రజాక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ



గూళ్యంలో రోగులను పరీక్షిస్తున్న వైద్యులు



మందులను పంపిణీ చేస్తున్న వైద్య సిబ్బంది

హాలహర్వి: మండలంలోని గూళ్యం గ్రామ సచివాలయం–2 పరిధిలో శుక్రవారం నిర్వహించిన 'జగనన్న ఆరోగ్యసురక్ష–2.0' కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ముందుగా ఆరోగ్య శిబిరాన్ని తహసీల్దార్ మల్లికార్జునస్వామి, ఎంపీడీఓ ఆంతోనీ ఆధ్వర్యంలో ప్రారంభించారు. వైద్యులు ప్రజలకు ఉచితంగా వైద్య పరీక్షలు చేసి మందులను పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ ప్రజలకు కావాల్సిన అన్ని పరీక్షలు ఉచితంగా నిర్వహించి, మందులు ఇవ్వడం జరుగుతుందన్నారు. ప్రజలు ఆరోగ్య సురక్ష శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈఓపీఆర్డీ మల్లికార్జున, వైద్యులు తిమ్మన్న, మన్సూర్‌వలీ, గైనకాలజిస్టు నిరోశ, నికిలేష్‌గుప్తా, తదితరులు వైద్య సేవలందించారు.

హొళగుంద: గ్రామాల్లోని పేదలకు మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం 'జగనన్న ఆరోగ్య సురక్ష' ఫేజ్–2 కార్యక్రమం నిర్వహిస్తోందని సర్పంచుల సంఘం మండలాధ్యక్షుడు కొత్తింటి వెంకటరెడ్డి, డాక్టర్లు న్యూటన్, రాధ అన్నారు. శుక్రవారం సర్పంచ్ కొత్తింటి వెంకటరెడ్డి, పంచాయతీ సెక్రటరీ షఫి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో డాక్టర్లు రాధ, న్యూటన్, వైద్య సిబ్బంది ప్రజలకు వైద్య సేవలు అందించారు. బీపీ, షుగర్, హెచ్‌బీ లాంటి సాధారణ పరీక్షలతో పాటు ఇతర జబ్బులున్న వారిని పరీక్షించి ఆరోగ్య జాగ్రత్తలు చెప్పి ఉచితంగా మందులు అందించారు. శిబిరంలో 403 మంది వైద్య సేవలు పొందారు.



పెద్దగోనెహాళ్‌లో వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న సర్పంచ్

దేవనకొండ: మండలంలోని అలారుదిన్నె గ్రామంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపు, డ్రైడే–ఫ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించినట్లు డాక్టర్ కళ్యాణ్ తెలిపారు. ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేసి ప్రజలకు వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. సీజనల్ జబ్బుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, జ్వరం, దగ్గు ఉంటే ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స చేయించుకోవాలన్నారు. సీహెచ్‌ఓ భాగ్యలక్ష్మి, సూపర్‌వైజర్లు రంగస్వామి, శ్రీధర్, హనుమంతమ్మ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆలూరు: సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలంటే చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని మొలగవెల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి రవి రోగులకు సూచనలు చేశారు. ఆలూరులోని సచివాలయం–1 ఆవరణలో జగనన్న ఆరోగ్య సురక్ష –2 కార్యక్రమాన్ని ఎంపీడీఓ అల్లబకాష్ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రారంభించారు. డాక్టర్ రవి ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది ప్రజలకు వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు



హెబ్బటంలో గ్రామస్తులతో మాట్లాడుతున్న ఆలూరు సీఐ వెంకటేశ్వర్లు, ఎస్‌ఐ శ్రీనివాసులు

హొళగుంద: శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని ఆలూరు సీఐ వెంకటేశ్వర్లు హెబ్బటం ప్రజలకు సూచించారు. ఆయన శుక్రవారం హొళగుంద ఎస్‌ఐ శ్రీనివాసులతో కలిసి హెబ్బటం, పెద్దగోనెహాళ్, ఎం.డీ హళ్లి, ఇంగళదహాళ్ తదితర గ్రామాలలో పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఆయా కేంద్రాలలో ఎన్నికలు నిర్వహించేందుకు తాగునీరు, మరుగుదొడ్లు, భవనాల పరిస్థితి, ఓటు వేసేందుకు వచ్చే దివ్యాంగులకు ర్యాంపులు ఉన్నాయా? లేవా తదితర వాటి గురించి అరాతీశారు. ఈ సందర్భంగా సీఐ హెబ్బటం గ్రామస్తులతో ముచ్చటిస్తూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడకుండా యువకులు, పెద్దలు అభివృద్ధి వైపు నడవాలన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు సహకరించాలని కోరారు.

అమ్మవారికి బంగారు గాజులు విరాళం

ఆలూరు: స్థానిక కోట వీధిలో కొలువుదీరిన సుంకమ్మవ్వకు శుక్రవారం వైఎస్సార్‌సీపీ నాయకుడు బోయ ఆకుల ఎల్లప్ప, ఎల్లమ్మ దంపతులు కుటుంబ సభ్యులతోకలిసి శుక్రవారం బంగారు గాజులను సమర్పించారు.తమ ఇలవేల్పు అమ్మవారికి నాలు గు తులాల బంగారంతో చేయించిన రెండు గాజులను అందించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు తీర్థ ప్రసాదాలను అందజేశారు.



బంగారు గాజులను తీసుకొస్తున్న బోయ ఎల్లప్ప కుటుంబసభ్యులు

మెనూ పాటించాలి

నందవరం: జగనన్న గోరుముద్ద పథకంలో భాగంగా విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని ఎంఈఓ సుదర్శన్‌రెడ్డి సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని కనకవీడు పేట గ్రామంలోని ఎంపీపీ స్కూల్‌లో మధ్యాహ్న భోజనం తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు పౌష్టికాహారంతో కూడిన భోజనం అందించాలన్నారు. గోరుముద్దలో నిర్లక్ష్యం వహించొద్దని వంట ఏజెన్సీ సభ్యులకు సూచించారు. అనంతరం విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించారు. ఉపాధ్యాయులు వెంట ఉన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

నందవరం: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే వికసిత్ భారత్ సంకల్ప యాత్ర లక్ష్యమని ఎంపీడీఓ దశరథ రామయ్య పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని కనకవీడు, కే పేట గ్రామాల్లో సర్పంచులు మద్దీశ్వరి, సరస్వతి ఆధ్వర్యంలో మండల అధికారులు వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వివిధ శాఖల అధికారులు కేంద్ర ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు, రాయితీలపై ప్రజలకు అవగాహన కల్పించారు. డాక్టర్ శ్రీలేఖ గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈపీఆర్డీ ఈశ్వరయ్య, ఏఓ మధ్రి స్రవంతి, ఎంఈఓ–2 రఘునాథ్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సుచరిత, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నేటి నుంచి వికసిత్ భారత్ యాత్ర

తుగ్గలి: మండలంలోని 23 గ్రామ పంచాయతీల్లో శనివారం నుంచి వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సావిత్రి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రచారం చేస్తారన్నారు. శనివారం బొందిమడుగులలో ప్రారంభమై ఈనెల 17న తుగ్గలిలో ముగుస్తుందన్నారు.



కనకవీడులో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర పాల్గొన్న మండల అధికారులు

రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు

వెల్దుర్తి(కృష్ణగిరి): బైక్ చక్రంలో చీర కొంగు చిక్కుకోవడంతో జరిగిన ప్రమాదంలో వెల్దుర్తి మండలం రామళ్లకోట సెక్టార్‌లోని లింగాలపల్లె అంగన్‌వాడీ కేంద్రం హెల్పర్ (ఆయా) దస్తగిరమ్మ తీవ్ర గాయాల పాలైంది. శుక్రవారం వెల్దుర్తి మండల కేంద్రంలో అంగన్‌వాడీ కార్యకర్తలు నిర్వహిస్తున్న సమ్మెలో పాల్గొనేందుకు లింగాలపల్లె నుంచి దస్తగిరమ్మ బయలుదేరారు. కొండపై ఉన్న లింగాలపల్లె దిగి కాల్వబుగ్గ, వెల్దుర్తి రహదారిపై వెళ్తున్న బైక్‌ను లిఫ్ట్ అడిగి బయలుదేరారు. ఈ క్రమంలో సిద్దినగట్టు వద్ద వెళ్తుండగా వెనుక కూర్చున్న దస్తగిరమ్మ చీర కొంగు బైక్ చక్రంలోకి ఇరుక్కోవడంతో అదుపుతప్పి కిందపడింది. ఆమె తలకు తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు ఘటనాస్థలికి చేరుకుని 108 అంబులెన్స్ ద్వారా కర్నూలులోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.



గాయపడ్డ దస్తగిరమ్మను అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం